
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# అటకెక్కిన సమయపాలన



12 గంటల వరకూ ఖాళీగా దర్శనమిచ్చిన ఓ అధికారి కుర్చీ

## ఎంపిడివో ఆఫీసులో ఖాళీ కుర్చీలే దర్శనం!

**12 దాటినా.. పత్తా లేని సూపరిండెంట్**

**పై అధికారులకు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరు**

**నిరీక్షించి వెనుదిరిగిన బాధితులు**

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన పూర్తిగా అటకెక్కింది. సామాన్య ప్రజల సమస్యలు తీర్చాల్సిన అధికారుల తీరు ముందు సొంత పని.. తర్వాతే ఆఫీసు పని అన్నట్లుగా మారింది. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఒ అధికారి వ్యవహారశైలిపై ఇప్పుడు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలు దాటినా సదరు అధికారి సీటులో లేకపోవడంతో పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10:30 గంటలకే కార్యాలయంలో ఉండాల్సిన అధికారులు, మధ్యాహ్నం వరకు కూడా రాకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. మండల అభివృద్ధి పనులను పర్యవేక్షి ంచాల్సిన కీలక విభాగాల్లోని కొందరు అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వివిధ ధ్రువీకరణ పత్రాలు, పెండింగ్ పనుల కోసం వచ్చిన ప్రజలు గంటల తరబడి వేచి చూసి, విసిగిపోయి వెనుదిరిగారు. కార్యాలయంలో అధికారుల గైర్హాజరీపై ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పే వారే కరువయ్యారు. దీనిపై ఎంపిడిఒ ప్రమీలా నాయక్‌ను వివరణ అడగ్గా, తాను ప్రస్తుతం శిక్షణలో (ట్రైనింగ్) ఉన్నానని, అధికారి గైర్హాజరీపై తనకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. మరోవైపు సూపరిండెంట్‌ను వివరణ కోరగా.. తన తల్లికి ఆరోగ్యం బాలేదని, అందుకే ఆసుపత్రికి తీసుకెళ్లానని వెల్లడించారు. ప్రస్తుతం తాను డ్యూటీలోనే ఉన్నానని, కార్యాలయానికి రావడానికి మరికొంత సమయం పడుతుందని ఆయన సమాధానమిచ్చారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## సీఆర్పీఎఫ్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక

**జవహర్‌నగర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** ఈ నెల 6వతేదీన తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిఆర్పిఎఫ్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబరచి త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు మేడ్చల్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు అని పాఠశాల ప్రిన్సిపాల్ డి. అపర్ణ మరియు ఫిజికల్ డైరెక్టర్ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి.అపర్ణ మాట్లాడుతూ, తమ పాఠశాలలో చదువుతో పాటు క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ కె. రాజశేఖర్ మాట్లాడుతూ, ఈ నెల పదకొండు, పన్నెండు తేదీలలో హన్మకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉప ప్రిన్సిపాల్ హరీశంకర్, వెంకటరాజు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బి. చంద్రశేఖర్, పి ఈ టీచర్లు టీ. భాస్కర్ రెడ్డి, మన్మథ రావు తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణం

**రాపోల్, కాడ్లాపూర్ గ్రామాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ప్రయత్నాలు**

**1197 ఎకరాల సమీకరణకు సన్నాహం**

**క్షేత్రస్థాయిలో సర్వేకు రావడంతో రైతులు ఆందోళన బాట**

**అర్ధరాత్రి మెరుపు ధర్నా..**

**కాంగ్రెస్ సర్పంచ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్ ముట్టడి**

**ప్రాణాలు పోయినా భూములు ఇచ్చేది లేదని స్పష్టీకరణ**

**నాయకుల భూములను ఎందుకు వదిలేస్తున్నారని మహిళా రైతుల ఆగ్రహం**

**పరిస్థితి ఉద్రిక్తంగా మారడం పోలీసులు అప్రమత్తం**

**స్టేషన్ గేట్లు మూసివేసి, నిరసనకారుల అడ్డగింత**

**మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డితోపాటు పలువురు బిఆర్ఎస్ నేతల అరెస్టు**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి/పరిగి ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో భూసేకరణ అంశం మరోసారి రాజ కీయంగా, సామాజికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పరిగి మండలంలోని రాపోల్, కాడ్లాపూర్ గ్రామాల్లో సుమారు 1197 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై స్థానిక రైతాంగం ఆగ్రహంతో రగిలిపోతోంది. ఇటీవలే దీనికి సంబంధించిన భూసేకరణ నోటిఫికేషన్ వెలువడటం, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేకు రావడంతో రైతులు ఆందోళన బాట పట్టారు. సోమవారం అర్ధరాత్రి పరిగి పట్టణంలో హైడ్రామా చోటుచేసుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ పులిందర్ ఆధ్వర్యంలో వందలాది మంది రైతులు ఒక్కసారిగా పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. తమ భూములను పరిశ్రమల పేరుతో లాక్కోవద్దని, ప్రాణాలు పోయినా భూములు ఇచ్చే ప్రసక్తే లేదని నినదించారు. మహిళా రైతులు సైతం పెద్ద ఎత్తున పాల్గొని, నాయకుల భూములను వదిలేసి పేద రైతుల పట్టా, అసైన్డ్ భూములపై ప్రభుత్వం ఎందుకు కన్నేసిందని ప్రశ్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు స్టేషన్ గేట్లు మూసివేసి, నిరసనకారులను అడ్డుకున్నారు.

**రాజకీయ రచ్చ..**

ఈ ఆందోళనకు మద్దతుగా వస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు పర్యటనకు పోలీసులు అనుమతి నిరాకరించడం నిప్పుకు ఆజ్యం పోసినట్లయింది. హరీష్‌రావు రాకకు పర్మిషన్ ఇవ్వాలంటూ రైతులు స్టేషన్ లోపల బైఠాయించారు. ఈ క్రమంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు ముందస్తు అరెస్టులకు దిగారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డిని అరెస్టు చేసి ధారూరు ఠాణాకు తరలించగా, వికారాబాద్, తాండూరు, కొడంగల్ ప్రాంతాల్లోని పలువురు బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. హరీష్‌రావును హైదరాబాద్‌లోనే హౌస్ అరెస్టు చేయడంపై నేతలు మండిపడ్డారు.



మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిని అరెస్ట్ చేసి తీసుకెళుతున్న పోలీసులు



అర్ధరాత్రి పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన మహిళా రైతులు

లగచర్ల ఘటన తర్వాత మళ్ళీ అదే స్థాయిలో పరిగిలో రైతులు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రైతులకు మద్దతుగా సీపీఐ, సీపీఎం పార్టీల నేతలు కూడా ఆందోళనలో పాల్గొనడం గమనార్హం.



పోలీస్ స్టేషన్‌లో బైఠాయించిన రైతులు



కాడ్లాపూర్‌లో దీక్ష చేస్తున్న రైతులు

## ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం

**కాడ్లాపూర్ సర్పంచ్ పులేందర్**

తమకు జీవనాధారమైన పంట భూములను మేము ప్రభుత్వానికి ఇచ్చేందుకు సంసిద్ధంగా లేమని, గత వారం రోజులుగా నిరసన ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవట్లేదని కాడ్లాపూర్ సర్పంచ్ పులేందర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. దాదాపు 597 ఎకరాలు కాడ్లాపూర్ రైతులు భూమిని కోల్పోతున్నారని, ప్రభుత్వం వెంటనే భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల తర్వాత ఉద్యమం తీవ్రతరం చేస్తామని సర్పంచ్ పులేందర్ తెలిపారు.

## రైతుల భూసేకరణపై మాజీ ఎమ్మెల్యేల ఆగ్రహం

**ధారూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** పరిగి నియోజకవర్గ పరిధిలోని రైతుల భూములను ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో లాక్కోవాలని చూడటం దుర్మార్గమని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మరియు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ధ్వజమెత్తారు. మంగళవారం ధారూర్ మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు.

**భూసేకరణ నోటిఫికేషన్‌పై నిరసన**

పరిగి మండలంలోని రాపోల్, కాడ్లాపూర్ గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు మహేష్‌రెడ్డి, మెతుకు ఆనంద్

చేయడంపై వారు మండిపడ్డారు. ఈ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వెంటనే, ఎటువంటి నిబంధనలు లేకుండా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. "పరిగి రైతాంగానికి వ్యవసాయం తప్ప మరే ఇతర జీవనాధారం లేదు. అటువంటి సారవంతమైన భూములను కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాక్కోవాలని ప్రయత్నిస్తున్నారు అని వారు ఆరోపించారు.

**ప్రజా వ్యతిరేక పాలనపై విమర్శలు**

రాష్ట్రంలో ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ రేవంత్ రెడ్డి కన్ను పడుతోందని వారు విమర్శించారు. హైడ్రా, మూసీ సుందరీకరణ, మరియు ఫార్మాసిటీల పేరుతో ప్రభుత్వం ప్రజలను తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కొడంగల్‌కు వెళ్లడానికి సరిపడా ఫోర్ లైన్ రోడ్లు ఉన్నప్పటికీ, మళ్లీ రోడ్ల విస్తరణ పేరుతో రైతుల నుంచి భూములు గుంజుకోవడం ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ట అని వారు పేర్కొన్నారు. ఇటీవల తాము మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు భరోసా కల్పించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**అక్రమ అరెస్టులపై ఆవేదన**

రైతుల పక్షాన నిరసన తెలిపేందుకు సిద్ధమైన తమను ప్రభుత్వం అణచివేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నాడు నిరసనలకు అనుమతి ఇచ్చిన పోలీసులు, తెల్లవారేసరికి మాట మార్చి మాజీ మంత్రి హరీష్ రావును హౌస్ అరెస్టు చేశారని దుయ్యబట్టారు. అదేవిధంగా పరిగి, వికారాబాద్ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులను తెల్లవారుజామునే పోలీసులు అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని వారు అన్నారు.



## ఇందిరమ్మ ఇళ్లతో కొత్త ఆశలు

**- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**కొత్తూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపాలిటీలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళను మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జె సుదర్శన్ గౌడ్, కౌన్సిలర్ హేమా దేవేందర్ ముదిరాజ్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ళన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నిజం చేసే దిశగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రజల్లో కొత్త ఆశలను నింపుతోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు గృహసౌకర్యం అందించడం ప్రాధాన్యంగా తీసుకొని ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇల్లు లేని కుటుంబాలకు సురక్షి తమైన నివాసం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కొత్తగా ఇళ్లు పొందిన లబ్ధిదారులు ఆనంద భాష్పాలతో తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారంతో తమ జీవితాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఇన్స్పెక్టర్ నర్సయ్య, సీనియర్ నాయకులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





**టెన్త్ స్పాట్ వాల్యువేషన్ సెంటర్ వద్ద**

## ఉపాధ్యాయ సంఘాల నిరసన

**మూల్యాంకన భత్యాలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌సి స్పాట్ మూల్యాంకనం కేంద్రం వద్ద మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా టిటిజెఎసి, యుఎస్‌పిసి, జాక్టోల ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసనలు, ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా పరిధిలోని ఎన్ఎస్ఎస్‌కె బాలానగర్‌లో ఏర్పాటు చేసిన టెన్త్ మూల్యాంకనం సెంటర్ వద్ద ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పలువురు నిరసనలు వ్యక్తం చేసి సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ భత్యాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2025లో నిర్వహించిన టెన్త్ స్పాట్ మూల్యాంకనంకు సంబంధించి రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని, అక్టోబరు 2024లో నిర్వహించిన కులగణన సంబంధించి రెమ్యునరేషన్ తక్షణమే చెల్లించాలని, గత ఏడు సంవత్సరాల నుంచి రెమ్యూనరేషన్ పెంచటం లేదని పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సారి జరుగుతున్న టెన్త్ స్పాట్ వాల్యువేషన్ రెమ్యునరేషన్ కూడ వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. టిటిజెఎసి చైర్మన్ వై.రామేశ్వర్‌గౌడ్, యుఎస్‌పిసి జయసింహారెడ్డి, జాక్టో చైర్మన్ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పిఆర్‌టియు టిఎస్, యుటిఎఫ్, ఎస్‌టియుల జిల్లా అధ్యక్షులు రామేశ్వర్‌గౌడ్, జయసింహారెడ్డి, బి.వెంకటేశ్వర్లు, ఆయా ప్రధాన కార్యదర్శులు ఆనంద్‌రెడ్డి, జిహెచ్ఎంఎ అధ్యక్షులు రాంరెడ్డి, హిందీపండితుల బాధ్యులు మహావీర్ సింగ్, శర్మ, తెలుగుపండిత్ పరిషత్ బాధ్యులు మాణిక్యం పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆస్థి పన్నులో ఐదు శాతం రాయితీ

**శామీర్‌పేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీల్లోని వివిధ వార్డుల ప్రజలు ప్రస్తుత ఈ 2026-2027 సంవత్సరానికి సంబంధించి ఈ నెల చివరి లోపు ఆస్థిపన్నులు చెల్లించే వారికి 5శాతం రాయితీ కల్పిస్తున్నట్లు అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, మూడు చింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్‌లు వేరువేరుగా తెలిపారు. మంగళవారం అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీల పరిధిలో ఉన్న వార్డుల్లో సంబంధిత అధికారులు,సిబ్బంది పర్యటించి పన్నురాయితీ చెల్లింపు విషయంపై ప్రజలకు అవగాహనలు కల్పించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంబంధిత బిల్ కలెక్టర్, మున్సిపల్ కార్యాలయ కలెక్షన్ సెంటర్, ఈ-సేవా, మీ-సేవాలలో నగదు చెల్లించవచ్చన్నారు.





మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతాదయాకర్, పాల్గొన్న చందన, సరిత, కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, తదితరులు

## స్లమ్ ఏరియాపై స్పెషల్ ఫోకస్

**బాలల భవిష్యత్తు కోసం ప్రత్యేక కార్యాచరణ**

**-అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు - రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతాదయాకర్ ఆదేశం**

**- ఎన్జీఓలు నిర్దిష్ట ప్రణాళికతో వెళ్లండి : కలెక్టర్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించడం అధికారుల సామాజిక బాధ్యతని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతదయాకర్ స్పష్టం చేశారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టోరేట్‌లో జవహర్‌నగర్ పరిధిలోని 18 ఏళ్ల లోపు పిల్లల పరిరక్షణ, వారిలో చైతన్యం కోసం నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు.

జవహర్‌నగర్‌లోని స్లమ్ ఏరియా కాలనీల్లో ఉన్న పిల్లలను కాపాడటమే కాకుండా, వారికి విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కలిసికట్టుగా పనిచేయాలని ఆదేశించారు.

అధికారులు స్వయంగా కాలనీల్లో పర్యటించి సమస్యలను గుర్తించి, అంకితభావంతో పరిష్కరించాలని సూచించారు. పాఠశాలకు వెళ్లని పిల్లలు, మధ్యలో చదువు మానేసిన (డ్రాపౌట్) వారి వివరాలను సేకరించి తనకు అందించాలని అధికారులను కోరారు. స్లమ్ ఏరియాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని, వైద్య సిబ్బంది అక్కడ నిరంతరం సేవలందించాలని ఆదేశించారు. ఆధార్ కార్డులు, పుట్టిన, కుల ధృవీకరణ పత్రాలు లేని పిల్లల కోసం అక్కడే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సర్టిఫికెట్లు అందజేయాలని కీసర ఆర్డీఓకు సూచించారు. ఆపరేషన్ ముస్కాన్ తరహాలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి బాలకార్మికులను గుర్తించాలని లేబర్ డిపార్ట్‌మెంట్‌ను ఆదేశించారు. బాల్య వివాహాలు, చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ వంటి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. జవహర్‌నగర్ ప్రాంతంలోని మెడికల్ షాపులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని డ్రగ్స్ కంట్రోల్ అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ, పిల్లలను ఆ వాతావరణం నుంచి బయటకు తీసుకురావడానికి అన్ని శాఖలు మరియు ఎన్జీఓలు సమన్వయంతో నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ నెలలో అంగన్వాడీల ద్వారా జరిగే ఫ్యామిలీ సర్వే డేటాను కూడా క్రాస్ వెరిఫై చేసి, సామాజిక ఆర్థిక పరిస్థితుల మెరుగుదలకు ఉపయోగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, రాష్ట్ర కమిషన్ సభ్యులు చందన, సరితలతో పాటు విద్య, వైద్య, పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

**దుద్యాల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని నాజ్ ఖాన్ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. దుద్యాల్ ఎస్సై శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం నాజ్ ఖాన్ పల్లి గ్రామానికి చెందిన ఎన్కేపల్లి కమలమ్మ (42) అనే మహిళ ఆర్థిక ఇబ్బందులతో తన ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పోస్ట్ మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

**-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** వరి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో యాసంగి (రబీ) ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో సన్నాహక, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. ఏ గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు 2,389 రూపాయలు, సాధారణ వరి ధాన్యానికి 2,369 రూపాయల మద్దతు ధరను నిర్దేశించడం జరిగిందని తెలిపారు. సన్న రకం ధాన్యానికి 500 రూపాయల బోనస్‌ను ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని టెంట్లు, త్రాగు నీరు సమకూర్చాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో విద్యుత్తు సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం 17 శాతం కంటే తక్కువ తేమ ఉన్న రైతులకు టోకెన్‌లు ఇచ్చి ధాన్యాన్ని సేకరించాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు, తూకం, తేమ, తూర్పార యంత్రాలు, గోనే సంచులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. దొడ్డు, సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుర్తించే విధంగా ప్రత్యేకంగా ఫ్లెక్సీలు ప్రదర్శించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దొడ్డు, సన్నరకం ధాన్యాన్ని తరలించేందుకు ప్రత్యేక వాహనాలను సమకూర్చు కోవాలని కలెక్టర్ సూచించారు. ఏవైనా ఫిర్యాదులు స్వీకరించే విధంగా హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి, డిఆర్డీఓ శ్రీనివాస్, డిఎం సిఎస్ మోహన్ కృష్ణ, డిసిఎస్ఓ సుదర్శన్, డిసిఎస్ఓ నాగార్జున, డిఏఓ రాజా రత్నం, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ శ్యామ్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్, అదనపు డీఆర్డిఓ నర్సింలు, డిపిఎం కొమురయ్య, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బాలేశ్వర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## నగలకు ఆశపడి వృద్ధురాలి హత్య

**కుల్కచర్ల, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో అదృశ్యమైన వృద్ధురాలి కేసు విషాదాంతమైంది. కేవలం ఒంటిపై ఉన్న ఆభరణాల కోసం పొరుగువారే ఆమెను దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో తేల్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన కొత్తబాయి వెంకటమ్మ (63) అనే వృద్ధురాలు ఈ నెల 4వ తేదీన ఉదయం 11 గంటలకు ఇంటి నుండి కుల్కచర్ల బ్యాంకుకు వెళ్తున్నానని చెప్పి బయలుదేరింది.



సాయంత్రం అయినా ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కూతురు లక్ష్మి ్మ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. వెంకటమ్మ ఇంటి పక్కనే నివసించే కుర్వ మంజుల, ఆమె భర్త భీరయ్య మరియు వారి బంధువు కలిసి ఆమెను చంపాలని పథకం వేశారు. సదరు వృద్ధురాలిని బైక్‌పై ఎక్కించుకుని తిర్మలాపూర్ గ్రామ సమీపంలోని పాడవుల బండపైకి తీసుకువెళ్లారు. అక్కడ ఆమె గొంతునులిపి ప్రాణాలు తీసి, అనంతరం ఒంటిపై ఉన్న నగలను దొంగిలించారు. ఆపై సాక్ష్యాలను తుడిచిపెట్టేందుకు మృతదేహంపై పెట్రోలుపోసి నిప్పు అంటించారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరాన్ని అంగీకరించారు. ఘటనా స్థలంలో కాలిపోయిన శవాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.



జడ్పీ భవన పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

## జడ్పీ భవన పనులు త్వరగా పూర్తి చేయాలి

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లాలో పరిపాలన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవనం నిర్మాణం ద్వారా అన్ని విభాగాలను ఒకే చోట సమీకరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని, నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిస్తూ, పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. భవనంలో ఆధునిక సౌకర్యాలు, సమావేశ మందిరాలు, కార్యాలయ గదులు ఏర్పాటు చేస్తున్నట్లు, భవనం నిర్మాణంలో భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు విద్యుత్, నీటి సరఫరా, పార్కింగ్ వసతులు కల్పించాలని అన్నారు. ఈ భవనం పూర్తయిన తరువాత ప్రజలకు పరిపాలనా సేవలు వేగవంతంగా సులభంగా అందుతాయని అన్నారు. మొదటి అంతస్తు పనులు పూర్తి అయిన వాటికీ పేంటింగ్ పనులు పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు జడ్పి సీఈఓ సుదీర్, పంచాయితీరాజ్ ఈఈ ఉమేష్ కుమార్, డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, సంబంధిత అధికారులు ఉన్నారు.



## పొన్నాల్‌లో సిసి రోడ్డు పనులకు శ్రీకారం

**శామీర్‌పేట, ఏప్రిల్ 7,ప్రభాతవార్త :** పొన్నాల్‌లో ఎంపి ఈటల రాజేందర్ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి ముహూర్తం చేశారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని పొన్నాల్‌లో 11,12వార్డులలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గాంధీ విగ్రహం వరకు ఎంపి నిధులతో సిసి రోడ్డు 190మీటర్లు, డ్రైనేజీ నిర్మాణం మొత్తం 19లక్షల రూపాయల మంజూరు కావటంతో నిర్మాణ పనులకు చైర్మన్ జాము రవి, ఆయా స్థానిక వార్డుల కౌన్సిలర్లు కొల్లాస్ రాజు, మ్యాడబోయినమౌనికవీరప్రసాద్‌లతో కలిసి ముహూర్తం చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు కమిషనర్ పవన్‌కుమార్, పంచాయతీరాజ్ ఎఇ సాన, కౌన్సిలర్లు ఆది అజయ్‌కుమార్, కాంట్రాక్టర్ జగన్, నాయకులు రామలింగారెడ్డి, సతీష్‌రెడ్డి, అజయ్‌లక్ష్మి, వార్డు, గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక కార్యకర్త మహేందర్‌కు దళితరత్న అవార్డు

**శామీర్‌పేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** దేవరయాంజాల్‌కు చెందిన సామాజిక కార్యకర్త ఈరగళ్ల మహేందర్‌కు దళిత రత్న అవార్డు దక్కింది. బాబుజగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ సుదర్శన్‌బాబు, జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్.వై.అశోక్‌ల గారి చేతుల మీదుగా అందుకున్నారు. సేవా కార్యక్రమాలను గుర్తించి మహేందర్‌కు దళితరత్న అవార్డును ప్రకటించి



అందజేశారని నగరంలో రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో అందజేశారని అన్నారు. దళితరత్న అవార్డును పొందిన ఈరగళ్ల మహేందర్‌ను జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, పలువురు అభినందించారు.

### నిర్ణీత స్టాప్ వద్దనే బస్సు నిలపాలి
### ఆర్టీసీ డిపో మేనేజర్ నమ్రత

**వికారాబాద్, ప్రభాతవార్త :** చేతి ఎత్తి బస్సును నిలిపి ప్రయాణికుల సమయాన్ని వృధా చేయవద్దని, నిర్ణీత బస్సు స్టాప్‌లలో బస్సును నిలిపి సమయం ఆదా చేయాలని వికారాబాద్ డిపో మేనేజర్ నమ్రత తెలిపారు. వికారాబాద్- నస్కల్ పరిగి బస్సు మార్గంలో 20 కి పైగా బస్సు స్టాప్‌లు ఉండటంతో అందులో ప్రతినిత్యం ప్రయాణించే ఉద్యోగులు, కళాశాల విద్యార్థులు సమయానికి గమ్యాన్ని చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని 20 స్టాపు లను 14 స్టాప్ లకు కుదించినట్లు ఆమె తెలిపారు. కొందరు ప్రయాణికులు చిన్న పాటి దూరానికే బస్సును నిలిపి దిగడం, ఎక్కడం వంటివి చేస్తున్నారని, అలా కాకుండా నిర్ణీత బస్ స్టాప్ ల వద్దనే బస్సును నిలిపి దిగి, ఎక్కాలని సూచించారు. ఈ విధంగా ప్రయాణికులు సహకరించినట్లు వికారాబాద్-పరిగి మార్గంలో ఎక్కువ సార్లు బస్సులు తిరిగే అవకాశం ఉంటుందని, ప్రయాణికులు సైతం సకాలంలో గమ్యాన్ని చేరుకుంటారని



గవర్నర్‌ను కలిసిన ఘంటా చక్రపాణి, ఎల్వీకే రెడ్డి

## గవర్నర్‌ను కలిసిన అంబేద్కర్ వర్సిటీ వీసీ

**జూబ్లీహిల్స్, ఎప్రిల్ 7, ప్రభాతవార్త :** గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకేరెడ్డి మర్యాదపూర్వంగా కలిశారు. విశ్వ విద్యాలయంలో జరుగుతున్న మహనీయుల జన్మదినోత్సవాలను పురస్కరించు కుని నిర్వహిస్తున్న సామాజిక సాధికారత వారోత్సవాల వివరాలను, ఆదివాసీ, ట్రాన్స్‌జెండర్ విద్యార్థులకు అందిస్తున్న ఉచిత విద్య గురించి వివరించారు. ఏప్రిల్ 14న యూనివర్సిటీలో నిర్వహించే అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొని ఆదివాసీ విద్యార్థులకు జ్యోతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించే ప్రోత్సాహక ఫెలోషిప్స్ పంపిణీకి హాజరు కావాలని ఆహ్వానించారు.

## వేల కుటుంబాలకు జీవనోపాధి ముఖ్యం ఎమ్మెల్యే

**కార్వాన్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** జియాగూడలోని అనధికారిక మేకల వధశాల జీహెచ్ఎంసీ వెటర్నరీ అదికారులు మూసివేసిన మేకల వధశాల ఎట్టకేలకు పునః ప్రారంభమైనది.

కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ చొరువతీసుకొని,సీఎల్ వేసిన జియాగూడ కబేళా తలుపులు తీశారు.జియాగూడ కబేళాపై జీవనోపాధిని ఏర్పరచుకొని ఎన్నో ఏండ్లుగా వృత్తి ఆధారపడిన ఆరెకటికలు, గొల్లకురుమలు, యాదవులు, జమైతుల్ ఖురేషీలు,దళిత తదితర వర్గాలకు చెందిన సుమారు 4 వేల కుటుంబాలక జీవనోపాధి దొరుకుతుందని,వారి జీవనాధారం కోల్పోకూడదని అన్నారు.

# వేసవిలో విద్యుత్ సమస్యలపై అప్రమత్తం

### క్షేత్రస్థాయిలో డివిజన్ అధికారుల పర్యవేక్షణ

(రంగారెడ్డి జిల్లా ప్రతినిధి-ప్రభాతవార్త)




రాష్ట్ర రాజధానికి ఆనుకుని ఉండి, వేగంగా విస్తరిస్తున్న రంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది విద్యుత్ కష్టాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. గత ఏడాదితో పోల్చితే ఈసారి ఏప్రిల్ మాసం ఆరంభంలో విద్యుత్ సరఫరాలో ఎక్కడా పెద్దగా అంతరాయం కలగకుండా జిల్లా స్థాయి అధికారులు తక్షణ చర్యలు చేపడుతున్నారు. మరో నెల రోజులు గడిస్తే జిల్లాలో కరంటు కష్టాలు పూర్తిగా తొలగిపోతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. క్షేత్రస్థాయిలో డివిజన్ అధికారులతో పాటు ఏఈలను అప్రమత్తం చేయడంతో, ఈ నెలలో జరిగిన ప్రజాపాలన గ్రామ సభల్లో కూడా ప్రజల నుండి విద్యుత్ సమస్యలపై పెద్దగా వ్యతిరేకత రాలేదని అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**పరిశ్రమలకు 24 గంటల సరఫరా**

నగర శివారు ప్రాంతాల్లో విస్తరిస్తున్న భారీ మరియు చిన్న తరహా పరిశ్రమలకు ప్రభుత్వం 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోంది. ఈ వ్యవస్థను పర్యవేక్షించేందుకు జిల్లా పరిధిలో ముగ్గురు ఎస్సీలు విధుల్లో ఉన్నారు. సైబర్ సిటీ ఎస్సీగా చంద్రశేఖర్, రాజేంద్రనగర్ ఎస్సీగా శ్రీరాంమోహన్, మరియు సరూర్ నగర్ ఎస్సీగా లక్ష్మీనారాయణలు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరి పరిధిలో 9 మంది డిఇలు, 25 మంది ఏడిలు, సుమారు 50 మంది వరకు ఏఈలు నిరంతరం పని చేస్తున్నారు.

**ముందస్తు జాగ్రత్తలు**

గాలి దుమారాలు లేదా వర్షాల సమయంలో విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగులుకోవడం వల్ల తలెత్తే చిన్నపాటి అంతరాయాలను మినహాయిస్తే, సరఫరాలో పెద్దగా ఇబ్బందులు లేవు. కొన్ని మారుమూల గ్రామాలు మరియు పట్టణ ప్రాంతాల్లో ఓవర్ లోడ్ కారణంగా సమస్యలు వస్తున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ, వాటిని పరిష్కరించేందుకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. గాలి వానల సమయంలో ప్రజలకు ఇబ్బందులు

# జర్నలిస్టు కాలనీలో సర్వే పూర్తి..

### అండగా ఉంటామని శ్రీనివాస్ రెడ్డి భరోసా

**తాండూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** జర్నలిస్టుల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ర్యాడికల్ బయో ఆర్గానిక్ లిమిటెడ్ ఈఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ సహకారంతో పాటు, తన సోదరుడు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో కలిసి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. తాండూరు మండలం అంతారం పరిసరాల్లోని పట్నం సునీతా మహేందర్ రెడ్డి జర్నలిస్టు కాలనీ భూముల వ్యవహారం గత 13 ఏళ్లుగా వివాదాస్పదంగా ఉంది. గతంలో 116 సర్వే నంబర్‌లో జర్నలిస్టులు రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేయగా, అప్పటి ఎమ్మెల్యే మహేందర్ రెడ్డి కూడా కొంత ఆర్థిక సాయం అందించారు. ఏడేళ్ల క్రితమే రిజిస్ట్రేషన్లు పూర్తయినప్పటికీ, కొన్ని రాజకీయ కారణాల వల్ల జర్నలిస్టులకు స్థలాల పొజిషన్ దక్కలేదు.

పరిష్కారం కాని ఈ సమస్యపై స్థానిక జర్నలిస్టులు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని, ఆయన సోదరుడు శ్రీనివాస్ రెడ్డిని ఆశ్రయించారు. స్పందించిన శ్రీనివాస్ రెడ్డి చొరవ తీసుకొని, మంగళవారం స్వయంగా క్షేత్రస్థాయికి చేరుకుని రీసర్వే చేయించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి, జర్నలిస్టులతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల విషయంలో రైతులకు



అంతారం సమీపంలోని జర్నలిస్టు కాలనీలో సర్వే పనులను పర్యవేక్షిస్తున్న బుయ్యని శ్రీనివాస్ రెడ్డి

కూడా న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. సర్వే పూర్తి కావడమే కాకుండా, ప్లాట్లకు హద్దులు కూడా ఏర్పాటు చేయించడంతో జర్నలిస్టుల 13 ఏళ్ల నిరీక్షణ ఫలించింది. తమ చిరకాల స్వప్నం నెరవేరుస్తున్నందుకు కృతజ్ఞతగా జర్నలిస్టులు శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.

# ప్రజాసమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సంజీవరెడ్డినగర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేట డివిజన్‌లోని బిజెఆర్‌నగర్, బిజెజెఆర్‌నగర్, బల్కం పేట, ఎస్సార్‌నగర్‌లలో నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఇటీవల ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి విన్నవించారు. దీంతో మంగళవారం ఆయన అధికారులతో కలిసి ఆయా ప్రాంతాలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 10 రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడంలేదని, నీటికోసం అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. ఒకవేళ నీటి సరఫరా చేసినా ప్రెషర్ తక్కువతో వస్తున్నాయని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే తనతోఉన్న వాటర్ వర్క్స్ సీజీఎం ప్రభును సమస్య గురించి ప్రశ్నించగా, బుధవారం నుంచి సక్రమంగా నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. సమస్య పరిష్కారం కాకపోతే ప్రజలతో కలిసి ఆందోళన చేపడతానని హెచ్చరించారు. అదే విధంగా బోర్‌వెల్స్ పని చేయడంలేదని, స్పెషల్ డ్రైవ్ చేపట్టి అవసరమైన మరమ్మతులు చేసి వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. బల్కంపేటలో పర్యటించిన సమయంలో స్థానిక కమిటీ హాల్‌కు విద్యుత్ సరఫరా లేదని, రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యేను



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్

కోరారు. వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పట్టించుకునేవారు లేకపోయారని, దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మున్సిపల్ శాఖ ముఖ్యమంత్రి వద్దే ఉందని, ప్రత్యేకంగా మున్సిపల్ శాఖకు మంత్రి ఉంటే సమస్యలపై సమీక్షలు చేసేవారని పేర్కొన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో తాగునీటి సమస్య ఏర్పడ కూడదనే ముందు ఆలోచనతోనే రిజర్వాయర్‌ను నిర్మించినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతలను మరిచి ప్రజా సమస్యలను గాలికొదిలిందని విమర్శించారు. సరైన కార్యాచరణ లేకుండా జిహెచ్ఎంసిని మూడు కార్పొరేషన్‌లుగా విభజించడంతో అధికారులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అమీర్‌పేట సర్కిల్ డీసీ సుజాత, డిఈ మహేష్, వాటర్ వర్క్స్ జీఎం సతీష్, శానిటేషన్ డిఈ వెంకటేష్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, కట్టా బలరాం, కరుణాకర్‌రెడ్డి, గుడిగే శ్రీనివాస్‌యాదవ్, రాజేష్ ముదిరాజ్, వనం శ్రీనివాస్, నాయకులు పీయూష్ గుప్తా, గౌతమ్, లలితా చౌహాన్, గోపీలాల్ చౌహన్, వినోద్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఉద్యోగాలకు ముప్పు లేదు

### ఒయు వైస్ ఛాన్సలర్ ప్రొ. కుమార్ మొలుగారం

**హైదరాబాద్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** విద్యార్థులు విద్యా నైపుణ్యాలతోపాటు సృజనాత్మకతను పెంపొందించుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. కుమార్ మొలుగారం అన్నారు. అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల వార్షికోత్సవ వేడుకలు 'తరంగ్ 2కె26' అత్యంత వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు తమలోని బలాలు, బలహీనతలను తెలుసుకునేందుకు ఎస్‌డబ్ల్యూఓటి విశ్లేషణ చేసుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఉద్యోగాలకు ముప్పులేదని, అది మరిన్ని కొత్త అవకాశాలను సృష్టిస్తుందని భరోసా ఇచ్చారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 35 ఏళ్ల క్రితం కేవలం 9 మంది విద్యార్థులతో ప్రారంభమైన తమ సంస్థ, నేడు 25 వేల మందికిపైగా విద్యార్థులతో వృద్ధి చెందిం దని తెలిపారు. త్వరలో అవంతిని డీమ్డ్ యూని వర్సిటీ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని పేర్కొన్నారు. విశిష్టఅతిథిగా హాజరైన తెలంగాణ ఉన్నత విద్యా మండలి సెక్రటరీ ప్రొ. శ్రీరామ్‌వెంకటేష్, ఎన్టీవీ సీఈఓ వై.రాజశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు



'తరంగ్ 2కె26' ప్రారంభిస్తున్న ప్రొ.కుమార్ మొలుగారం, చిత్రంలో విద్యాసంస్థ చైర్మన్ శ్రీనివాసరావు

తగ్గట్లుగా నైపుణ్యాలు పెంచుకోవాలని కోరారు.

ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అలీముద్దీన్ మాట్లాడుతూ, ఈ ఏడాది 400 మందికిపైగా విద్యార్థులు ప్రముఖ కంపెనీ ల్లో ఉద్యోగాలు సాధించారని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక అంశాలపై నాటికలు అలరించాయి. వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు అతిథుల బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ ఎం. జ్ఞానేశ్వరి, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం. ప్రియాంక, ఎండీ ఐ.శ్రావణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదు

### స్వచ్ఛ సనాతన వేదిక హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 7,ప్రభాతవార్త:**

సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదని స్వచ్ఛ సనాతన వేదిక నాయకులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శివ శక్తి అధ్యక్షులు కరుణాకర్ సుగ్గున,హిందూ జనశక్తి అధ్యక్షులు లలిత్ కుమార్, భారతవర్ష అధ్యక్షులు దువ్వాడ శివ ప్రసాద్, హైందవి స్వరాజ్ అధ్యక్షులు భాస్కర్ కిల్లి తదితరులు హాజరై మాట్లాడారు.. గత కొద్ది రోజులుగా షిరిడీ సాయి బాబా అంశంపై హిందూ సంఘాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, తెలంగాణ, మహారాష్ట్రలో అక్రమ కేసులు బనాయిస్తు న్నారని ఆరోపించారు.

కోర్టుల చుట్టూ తిప్పుతామని, 50 కోట్ల రూపాయల వరకు పరువు నష్టం దావా వేస్తామని బెదిరించడం రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేయడమేనని అన్నారు.

సాయి భక్తుల పేరుతో కొందరు వ్యక్తులు చేస్తున్న అచారాలు, ప్రచారాలు సనాతన ధర్మానికి తీరని నష్టం కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాయి బాబా ముస్లిం అని, ఆయన దత్తాత్రేయ అవతారం కాదని, సనాతన ధర్మం ప్రకారం ఆయన దేవుడు లేదా గురువు కూడా కాదని తమ అభిప్రాయాన్ని తెలిపారు.

మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో హిందూ సంఘాల నాయకుల ఫోటోలతో కూడిన పోస్టర్లు వేసి, వారిని భౌతికంగా దెబ్బతీస్తామని, అవసరమైతే హత్య చేస్తామని షిరిడీ సాయి సంస్థానం ప్రతినిధులు బహిరంగంగా బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. తాము అడిగిన ప్రశ్నలలో తప్పులు ఉంటే ఆధారాలతో నిరూపించాలని, అప్పుడు తాము నిజాన్ని అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కేవలం భక్తి ముసుగులో అమాయక హిందువులను ధర్మానికి దూరం చేయడం సరికాదన్నారు. సనాతన ధర్మాన్ని, దేవీ దేవతలను, పుణ్యక్షేత్రాలను అవమానించేలా చేస్తున్న ప్రచారాలను ప్రతి హిందువు గమనించాలని కోరారు. స్వచ్ఛమైన సనాతన ధర్మాన్ని భవిష్యత్తు తరాలకు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు .



ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**మేడ్చల్, ఏప్రిల్ 7. ప్రభాతవార్త :** నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పాఠశాలలపై ముఖ్యంగా పూర్తి రోజు తరగతులు నడిపిస్తున్న మేడ్చల్ పట్టణంలోని హైటెక్ వాలీ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఒంటి పూట బడులు నడిపించాలని స్పష్టమైన ప్రభుత్వ ఆదేశాల ఉన్నా అనేక పాఠశాలలు వాటిని పట్టించుకోకుండా పూర్తి సమయం పాఠశాలలు నిర్వహిస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. ఎండ తాపంతో విద్యార్థులు శారీరక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. చిన్నపిల్లలు వేడి తీవ్రతను తట్టుకోలేక ఒత్తిడి, అలసట, ఆరోగ్య సమస్యలకు గురవుతున్న పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి నిబందనలకు విరుద్దంగా కొనసాగుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మండల నాయకులు వినయ్, రాజశేఖర్, కార్తిక్, నేహాల్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు, వైద్య విద్యార్థులు

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

**మేడ్చల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధి ఘన్‌పూర్ గ్రామ శివారులో గల మెడిసిటి వైద్య కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు రంగోళి, క్విజ్, డిజిటల్ పోస్టర్ల తయారీలో పోటీలు నిర్వహించారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. శైలేంద్ర మాట్లాడుతూ పర్యావరణాన్ని జత చేసుకోకుండా కేవలం మానవ ఆరోగ్యాన్ని పరిరక్షించడం సాధ్యం కాదన్న విషయాన్ని కోవిడ్ నిరూపించిందని చెప్పారు. కోవిడ్ వైరస్ జంతువుల నుండి మానవాలికి సోకిందనే విష యాన్ని గుర్తు చేస్తూ మన చుట్టూ ఉన్న పర్యావరణం, జంతుజాలాన్ని జత చేసుకోకుండా పని చేస్తే ఫలితాలు ఉండవని అన్నారు. విషయాన్ని గుర్తించి పని చేయడానికి వన్ హెల్త్ విధానాన్ని నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రోత్సహిస్తున్నారని ఈ దిశగా ఆందరూ ఆలోచించాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దేవేంద్ర సింగ్ నేగి, వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్‌లు డాక్టర్ కల్పన, డాక్టర్ లియోవాజ్, డాక్టర్ ఈనాక్షి , డాక్టర్ పవన్ కుమార్ శర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు అంకుష్ పవార్, హేమలత, వైద్య విద్యార్థులు, నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మాజీ మంత్రులు హరీష్ రావు, సబితాఇంద్రారెడ్డి మంగళవారం పరిగి రైతుల సమస్యల గురించి తెలుసుకొని, వారికి మద్దతు తెలుపడానికి వస్తున్న సంధర్భంగా బీఆర్ఎస్ నాయకులను మోమిన్‌పేట్ పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడంతో తదుపరి నష్టపోయేది అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీయేనని మోమిన్‌పేట్ బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సర్భంగా వారు మాట్లాడుతు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను ఎక్కిన కొమ్మను తానే నరుక్కున్నట్లు ఉందని, ఇప్పటి పరిస్థితులు కాంగ్రెస్ అధికార పార్టీకి తెలంగాణ ప్రజలే తగిన గుణపాఠం చెప్పే రోజులు సమీపిస్తున్నాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేసారం సర్పంచ్ కిష్టయ్య, మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు కాశీరాం, అబ్బాస్, కార్తీక్ రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకులు ఉన్నారు.

**దుద్యాల్‌లో..**

**దుద్యాల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** పరిగి మండలం రాపోల్, కడ్లాపూర్ భూ బాధిత రైతులకు మద్దతు తెలపడానికి వెళ్తారనే ముందస్తు సమాచారంతో మండలంలోని పలువురు బిఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్ కి తరలించి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ ,అయిన వారిలో ర్యాకం యాదయ్య, బసప్ప, రమేష్, సేవ్యా నాయక్, విశాల్ తదితరులున్నారు.

## కోళ్ల పందెం స్థావరంపై మెరుపు దాడి

**తలకొండపల్లి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** కోళ్ల పందెం స్థావరంపై మెరుపు దాడి చేసి, ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న సంఘటన తలకొండపల్లి మండలంలో వెలుగు లోకి వచ్చింది. తలకొండపల్లి ఇన్స్పెక్టర్ వి జానకిరామ్ రెడ్డి వివరాల ప్రకారంగా రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం అంతారం గ్రామ శివారులో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కోళ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం తెలియడంతో ఇన్స్పెక్టర్ జానకిరామ్ రెడ్డి సూచనల మేరకు ఎస్ఐ కే శేఖర్ తో పాటు 04 పోలీసు సిబ్బంది దాడులు చేశారని తెలిపారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకోగా, మరో కొంతమంది పరారైనట్లు వివరించారు. పట్టుపడ్డ వారి నుంచి నాలుగు పందెం కోళ్లను, 05 బైక్‌లను, రెండు మొబైల్ ఫోన్లు, వెయ్యి రూపాయలు నగదును మరియు కోళ్ల కాళ్లకు కట్టే 20 కత్తులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించినట్లు పేర్కొన్నారు. కోళ్ల పందేలు, పేకాటతో మ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా కుదేలై, అప్పుల బారిన పడుతున్నాయని అన్నారు. పారిపోయిన వారిని గుర్తించి వారిపై కూడా కేసు నమోదు చేస్తామని ఇన్స్పెక్టర్ తెలిపారు.

## బిజెపి కార్యవర్గ సభ్యులకు సన్మానం

**అల్వాల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన వారికి మంగళవారం ఘన సన్మానం జరిగింది. ఇటీవల పార్టీ కార్యవర్గ సభ్యులుగా పరాంకుశం మాధవ్, చింతల మాణిక్య రెడ్డి, శ్రీనివాస్ వర్మ, గోపు రమణా రెడ్డిలు పార్టీ ఎంపిక చేసింది. అల్వాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ పటిష్టత, ప్రజా సమస్యలు పరిష్కారం కోసం శ్రేణులు శ్రమించాలని వారు పిలుపు ఇచ్చారు.

## శానిటేషన్ సిబ్బందికి హెల్త్ క్యాంప్

**దుండిగల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దుండిగల్‌సర్కిల్‌లో శానిటేషన్ సిబ్బందికి మంగళవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ పర్యవేక్షించారు. దుండిగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ హెల్త్‌క్యాంప్‌లో శానిటేషన్ సిబ్బంది, ఇతర ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వర్ణలత, దుండిగల్ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ విజయ మోహన్ రావు, అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్, హాస్పిటల్ ఇన్‌చార్జ్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పిసిసి నాయకులు

## మైసిగండి మైసమ్మ ఆలయంలో పిసిసి అధ్యక్షుడి ప్రత్యేక పూజలు

**కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులకు ఘన స్వాగతం**

**రంగారెడ్డి అర్బన్,ఏప్రిల్7,ప్రభాతవార్త:** జిల్లా లోని కడ్తాల్ మండలంలోని ప్రసిద్ధ మైసిగండి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తి వాతావరణం నెలకొంది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు,ఏఐసిసి కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి విచ్చేసిన నాయకులకు అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మహేష్ కుమార్ గౌడ్, వంశీచంద్ రెడ్డి అభిషేకం, అర్చన, హారతి వంటి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారికి పుష్పాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రంలో శాంతి, సుభిక్షం నెలకొనాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,పిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్,ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గీత నరసింహ ముదిరాజ్,నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారు కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. నాయకులరాకతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.స్థానిక కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై వారికి ఘన స్వాగతం పలికారు.అనంతరం నాయకులు భక్తులతో కలిసి కొంతసేపు గడిపి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు.కడ్తాల్ మండల కేంద్రం లో కాంగ్రెస్ కార్యకర్తలు మహేష్ కుమార్ గౌడ్,మంత్రి జూపల్లికి ఘన స్వాగతం పలికారు. బ్యానర్లు,నినాదాలతో వాతావరణం కాంగ్రెస్మయం అయింది.ప్రాంతీయంగా ప్రాచుర్యం పొందిన మైసిగండి మైసమ్మ ఆలయానికి ప్రత్యేక రోజుల్లో వేలాది మంది భక్తులు తరలివస్తుండగా,ఈ సందర్భంగా నాయకుల దర్శనం ఆలయానికి వచ్చిన భక్తుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది.



పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలుకుతున్న అర్చకులు

## గ్యాసు ఏజెన్సీ మంజూరు చేయాలి



తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 07(ప్రభాతవార్త):** జిల్లేడు చౌదరి గూడ మండలంలో నూతనంగ గ్యాస్ ఏజెన్సి మంజురు చేయాలని కోరుతు బిఆర్ఎస్ నాయకులు తహసిల్దారు కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రసుతం మండలంలో ప్రజలకు గ్యాసు కొరత తీవ్రంగా ఉన్నదన్నారు. గ్యాసు కొరత లేదు అని చెప్తున్నా, గ్యాసులు ఏజెన్సీలు బ్లాకులో అమ్ముతున్నారని పేర్కొన్నారు. మండలంలో దాదాపు 40వేల జనాభా ఉందని అన్నారు. జనాభాకు తగిన గ్యాస్ సరఫర కావడం లేదని మండలంలో నూతనంగ గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సయ్యద్ హాఫీజ్, కొండి యాద య్య ,రాములు, మణయ్యా. రాజు,ఇస్మాయిల్, నర్సింహులు, జబ్బారు, జహంగీర్, మల్లేష్, శివరాజ్,అజ్మీర్ ,గోపాల్, చందర్ నాయక్, హిర్య నాయక్ ,మాన్య తదితరులు పాల్గొన్నారు.

## జియాగూడ స్లాటర్ హౌజ్‌ను తెరువకపోతే సహించం

**-బిఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీర్‌రెడ్డి ధ్వజం**

**చేవెళ్ల, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** జియాగూడ స్లాటర్ హౌజ్‌ను తెరువకపోతే సహించేదిలేదని, సిఎం రేవంత్‌రెడ్డి జాగీరా, ఇష్టాను సారంగా వ్యవహరిస్తే మాత్రం ఊరుకోమని బిఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం జియాగూడ స్టాటర్ హౌజ్ మార్కెట్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీర్‌రెడ్డి మాట్లాడుతూ జియాగూడ్ స్టాటర్ హౌజ్ మార్కెట్‌కు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని రైతులు, ప్రజలు అధికసంఖ్యలో వస్తుంటా మని, మా ప్రాంత ప్రజల కడుపు కొడితే మాత్రం ఊరుకునేది లేదన్నారు. ప్రతి నిత్యం 200 కోట్ల వ్యాపారం చేసే మార్కెట్‌ను బంద్ చేస్తారా అన్నారు. రైతుల, ప్రజల మార్కెట్‌ను బంద్ చేస్తేమాత్రం నీ అంతు చూస్తామని హెచ్చరించారు.వేలాది కుటుంబాలను రోడ్డున పడేసే పనులు మానుకుని ప్రజలకు ఉపయోగ పడే పనులపై దృష్టి సారించాలన్నారు.రోజు కూలీలు అధికంగా ఉన్నారని, కూలీలకు రోజూ పని కల్పించాల్సి బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

జియాగూడ స్టాటర్ హౌజ్ మార్కెట్ నిజాం కాలం నుండి నడుస్తుందన్నారు. ప్రభుత్వం పనికిరాని పనులను చేస్తుంటే ఊరుకోమన్నారు. వారం రోజుల్లోపు స్టాటర్ హౌజ్ మార్కెట్‌ను తెరువకపోతే పెద్ద ఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు.



జియాగూడ స్టాటర్ హౌజ్ మార్కెట్‌ను సందర్శించిన బిఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీర్‌రెడ్డి

## దౌల్తాబాద్‌లో బిఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులు!

**-హరీష్ రావు పర్యటన వేళ ఉద్రిక్తత -అర్ధరాత్రి నుంచే పోలీసుల నిర్బంధం**




బిఆర్ఎస్ నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

**దౌల్తాబాద్,ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై గళమెత్తితే అక్రమ అరెస్టులతో అణిచివేస్తారా? అంటూ బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం మండిపడ్డారు.పరిగి మండంలోని కాళ్లాపూర్,రాపోల్ గ్రామాల పరిధిలో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు కోసం భూములు ఇచ్చేందుకు నిరాకరించిన రైతులకు మద్దతుగా మాజీ మంత్రి హరీష్ రావు వస్తున్న నేపథ్యంలో మంగళవారంరోజు తెల్లవారుజామున 4:00 గంటల ప్రాంతంలో దౌల్తాబాద్ మండల కేంద్రంలోని పలువురు బిఆర్ఎస్ ముఖ్య నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రైతు భరోసా రాక,పూర్తిగా రుణమాఫీ కాక,ఎరువులు అందక రైతులు అల్లాడుతుంటే పట్టించుకోని ప్రభుత్వం,వారి తరపున పోరాడుతుంటే అక్రమ కేసులు పెడుతోందని మండిపడ్డారు.మాకు.ఉద్యమాలు,కేసులు,జైళ్లు కొత్తకాదని,పోలీసుల బలాన్ని చూపి ప్రతిపక్షాలను అణచివేయాలని చూడటం అప్రజా స్వామికమని,తాటాకు చప్పుళ్లకు బిఆర్ఎస్ నాయకులు భయపడరని అన్నారు.ప్రజా పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని,ఈ అక్రమఅరెస్టులను ప్రజలు గమనిస్తున్నారని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్,వైస్ ఎంపిపి మహిపాల్‌రెడ్డి,బిఆర్ఎస్ అధికార ప్రతినిధి సంతోష్, ఆశప్ప,బాలరాజ్.వెంకట్‌రెడ్డి,మాజీ సర్పంచులు రమేష్,అశోక్,హరికృష్ణ పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం

**- ఆరోగ్యంగా ఉంటేనే మనిషి జీవనం సాగుతుంది**

**-చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య వెల్లడి**

**చేవెళ్ల ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**

ఆరోగ్యంగా ఉంటేనే మనిషి జీవనం సాగుతుందని, ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు చెప్పిన మాటలు పాటించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అందజేశారు. అనంతరం ప్రపంచ అరోగ్య దినోత్సవంను పురస్కరించుకుని చేవెళ్ల అసుపత్రిని ఎమ్మెల్యే సందర్శించారు.చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవంను ఘనంగా చేశారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఆరోగ్యం ఉంటేనే సంపద కలుగుతుందన్నారు.మనిషి ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా అవసరమన్నారు.జీవితంలో ఒత్తిడి అందోళనలు పెరుగుతు న్నాయని, ప్రతి రోజు వ్యాయమం, నడకతో పాటు సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు.ప్రతి రోజూ మనిషి సరైన నిద్రపోవాలన్నారు.



చేవెళ్ల ఏమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం రిలిఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య

ప్రభుత్వం అరోగ్య పరిరక్షణ కొరకు అనేక కార్యక్రమాలు చేపడుతుం దన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వ అసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యంను అందించేందుకు ఏర్పాట్లు చేసిందన్నారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి,వైస్ చైర్మన్ రాము గౌడ్,కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి,మంగళి కళ్యాణి యాదగిరి, మద్దెల శ్రీనివాస్, క్రిష్ణానాయక్, తాళ్లపల్లి నర్సింలు, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్య గౌడ్,వైస్ చైర్మన్ బేగరి రాములు,గొల్లపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ పాండు, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి,చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస గౌడ్,మాజీ ఎంపిటిసి గుండాల రాములు,మాజీ సర్పంచులు జాంగీర్, శంకర్,పడాల ప్రభాకర్,ముడిమ్యాల సుహకార సంఘం మాజీ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి,చేవెళ్ళ సహకార సంఘం మాజీ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి,నాయకులు రవీందర్,ఆగిరెడ్డి,మల్లేష్, పాల్గొన్నారు.



ప్రపంచ అరోగ్య దినోత్సవం సందర్బంగా చేవెళ్ల ప్రభుత్వ అసుత్రిని సందర్శించి అసుపత్రిలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

## గంజాయి,బెల్ట్ షాపులను నివారించండి



పోలీస్ కమిషనర్‌ని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**కడ్తాల్, ఎప్రిల్ 7, ప్రభాత వార్త :** కడ్తాల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో యువత గంజాయి మత్తుకు బానిసై ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, అక్రమ గంజాయి రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పిఎస్ నాయకులు పోలీసులను కోరారు. కడ్తాల్ ఎమ్మార్పిఎస్ మండల్ అధ్యక్షుడు అబ్బు రమేష్ మహేశ్వరం మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎర్ర గణేష్, ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మహేశ్వరం ఫ్యూచర్ సిటీ కమీషనరేట్ ఎసిపి జానకి రెడ్డిని కలిశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోకి అక్రమంగా గంజాయి సరఫరా జరుగుతోందని, దీనివల్ల యువత దారి తప్పుతున్నారని తెలిపారు. గంజాయి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, గ్రామాల్లో నడుస్తున్న బెల్టు షాపులపై కూడా కఠినంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా సాయంత్రం సమయాల్లో గ్రామాల్లో యువతకు గంజాయి ప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, పోలీసులు మరియు స్థానిక నాయకులు కలిసి చైతన్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో దాసప్ప గారి కిరణ్, విజేందర్, కె.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ను తాండూరు వరకు పొడిగించాలి..!

**-- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన బిజెపి కౌన్సిలర్లు**

**తాండూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** పల్నాడు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌ను వికారాబాద్ జంక్షన్‌లోనే ఆపకుండా తాండూరు వరకు పొడిగించేలా చర్యలు తీసుకోవాలంటూ తాండూరు పట్టణ బిజెపి కౌన్సిలర్లు నాగారం మల్లేశం, శ్రీకాంత్‌రెడ్డి, అంతారం కిరణ్ చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కోరారు. మంగళవారం బిజెపి కౌన్సిలర్లు ఎంపి కొండాను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపి వెంటనే సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులకు రిక్వెస్ట్ లెటర్‌ను పంపించారు. అదేవిధంగా మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చినమాట ప్రకారం తాండూరుపట్టణంలో గెలుపొందిన ముగ్గురు బిజెపి కౌన్సిలర్లకు వార్డుల అభివృద్ధి కోసం ఒక్కొక్కరికి రూ.10లక్షల చొప్పున ఎంపి నిధులకు మంజూరు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు ఎంపీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు.



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన బిజెపి కౌన్సిలర్లు.

## సంక్షేమ పథకాల్లో డబ్బుల వసూళ్ళకు పాల్పడితే సహించేది లేదు

**నాయకులకు తిరుపతిరెడ్డి వార్నింగ్**

**కొడంగల్,ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్దిదారుల నుంచి నాయకులు డబ్బుల వసూళ్ళకు పాల్పడితే సహించేది లేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి హెచ్చరించారు.మంగళవారం స్దానిక కడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ లబ్దిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆర్దిక ఇబ్బందులు ఉండి ఆసుపత్రి బిల్లులు భరించలేని వారి కోసం ప్రభుత్వం అందిస్తున్న సిఎంఆర్ఎఫ్ చెక్కులకు ఎవరైనా డబ్బులు అడిగితే ఎట్టి పరిస్దితుల్లో ఇవ్వవద్దని సూచించారు.సిఎంఆర్ఎఫ్ చెక్కులకు ఎలాంటి పైరవీలు అవసరం లేదని,ఏ అధికారికి గాని,కాంగ్రెస్ కార్యకర్తలకు కాని డబ్బులు ఇవ్వరాదని అన్నారు.ఏవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకొనిరావాలని అన్నారు.పేదలకు ఆసుపత్రుల్లో చికిత్స కోసం మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఆర్దిక సహాయాన్ని అందిస్తుందని గుర్తు చేశారు.ఇలాంటి పథకాల్లో చేతివాటం ప్రదర్శిస్తే ఊరుకునేది లేదని తిరుపతిరెడ్డి వార్నింగ్ ఇచ్చారు.కొడంగల్ మండలంలో 47 మంది లబ్దిదారులకు సుమారు రూ.25లక్షల వరకు చెక్కులను ఆయన లబ్దిదారులకు అందజేశారు.ఈ కార్య క్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి,కొడంగల్,కోస్గీ మున్సి పల్ చైర్మన్ నందారం ప్రశాంత్,నాగులపల్లి నరేందర్‌రెడ్డి, వికారాబాద్,నారాయణపేట్ జిల్లా గ్రంధాలయ సంస్దల చైర్మేన్‌లు రాజేష్‌రెడ్డి,వార్ల విజయ్‌కుమార్,కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మేన్ అంబయ్యగౌడ్,మున్సిపల్ వైస్ చైర్మేన్ శంకర్‌నాయక్,కొడంగల్,కోస్గీ మండలాల కాంగ్రెస్ నాయకులు కొడంగల్ నయ్యూం,అసీఫ్‌ఖాన్, రఘువర్దన్‌రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్‌లు కుశగారి రాజశేఖర్,బత్తుల అనితనర్సింహలతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.




లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న తిరుపతిరెడ్డి

**ప్రభుత్వ అథిధి గృహం నిర్మాణ పనుల పరిశీలన :**

కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ అతిధి గృహం నిర్మాణ పనులను తిరుపతిరెడ్డి పరిశీలించారు. మంగళవారం ఆర్‌అండ్‌బి అధికారులతో కలిసి అతిధి గృహనికి చేరుకొని నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో అలసత్వం ప్రదర్శించకుండా నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## భూసేకరణపై బిఆర్ఎస్ గర్జన

నాయకుల అరెస్టును తప్పుబట్టిన కే. వేణుగోపాల్ రెడ్డి

**ధారూర్, ఏప్రిల్ 7, ప్రభాత వార్త:** ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో పేద రైతుల భూములను లాక్కోవడాన్ని ప్రశ్నించినందుకు బిఆర్ఎస్ అగ్ర నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కే. వేణుగోపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం పరిగి మండల పరిధిలోని కడ్లాపూర్, రాపోల్ గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల భూమిని ప్రభుత్వం బలవంతంగా సేకరించడాన్ని నిరసిస్తూ ఆయన తీవ్రంగా స్పందించారు. మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్ ల అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, గత నెల రోజులుగా కడ్లాపూర్, రాపోల్ గ్రామాలకు చెందిన సుమారు 200 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులు తమ భూములు కాపాడుకోవడానికి నిరాహార దీక్షలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం నిరక్ష ్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. రైతులకు మద్దతుగా నిలిచిన నాయకులను అరెస్టు చేసి జైలుకు పంపడం ద్వారా ప్రభుత్వం తన చాటుకుందని, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. రైతుల పొట్ట కొట్టి ప్రభుత్వం చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ఎండగడతామని, ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరి వీడి భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఈ నిరసనల నేపథ్యంలో ధారూర్ పోలీసులు ముందస్తు జాగ్రత్తగా పలువురు నాయకులను అరెస్ట్ చేశారు.ఆయనతో పాటు మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, ధారూర్ వార్డ్ సభ్యులు సీతగారి లక్ష్మయ్య, హఫీజ్ ఖురేషి, జైపాల్ రెడ్డి, వెంకట్, బింషెన్, బాలు నాయక్, రవి నాయక్, హాయమతుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.




ధారూర్ పోలీసుల అదుపులో బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**తండ్రి మరణించినా**

## గుండె నిబ్బరంతో పదో తరగతి పరీక్ష రాసిన శేషికల

**ధారూర్, ఏప్రిల్ 7,ప్రభాత వార్త:** విధి ఆ బాలికను కోలుకోలేని దెబ్బ తీసింది. కళ్ల ముందే కన్నతండ్రి విగతజీవిగా పడి ఉన్నా, ఆ కన్నీళ్లను దిగమింగుకుని తన భవిష్యత్తు కోసం ఆ యువతి పరీక్షా కేంద్రానికి కదిలివచ్చింది. ఈ విషాదకర సంఘటన ధారూర్ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, మండల పరిధిలోని బోజ్యా నాయక్ తండాకు చెందిన రవి నాయక్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన కుమార్తె శేషికల ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తోంది.బయోలాజీ పరీక్ష కావడంతో, తండ్రి మరణించిన తీవ్ర దుఃఖంలోనూ ఆమె ధైర్యాన్ని కోల్పోకుండా కెరెల్లిలోని పరీక్షా కేంద్రానికి చేరుకుంది. ఇంటి వద్ద తండ్రి భౌతిక కాయం ఉండగానే, తండ్రి కన్న కలలను నిజం చేయాలన్న సంకల్పంతో ఆమె పరీక్ష రాసింది.పరీక్షా కేంద్రంలో శేషికల పరిస్థితిని చూసిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు కంటతడి పెట్టుకున్నారు. పితృవియోగం కలిగినా గుండె నిబ్బరంతో పరీక్ష రాసిన శేషికల ధైర్యాన్ని చూసి స్థానికులు ఆమెను అభినందిస్తూనే, ఆ కుటుంబాన్ని ఓదార్చారు. పరీక్ష ముగిసిన వెంటనే శేషికల తన ఇంటికి చేరుకుని తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది.





అనురాగ్ యూనివర్శిటీ పేద వికలాంగ యువకుడికి ల్యాప్టాప్‌ను అందజేసిన డీన్ విష్ణుమూర్తి తదితరులు.

## అనురాగ్ యూనివర్శిటీ సహాయ ద్వారా వికలాంగ యువకుడికి ల్యాప్టాప్ పంపిణీ

**ఘట్‌కేసర్ రూరల్.ఏప్రిల్ 7, ప్రభాత వార్త:** వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీ వారు సహాయ కమ్యూనిటీ సపోర్ట్ ఇనిషియేటివ్ ద్వారా వికలాంగ యువకుడికి మంగళవారం ల్యాప్టాప్ అందజేశారు. అనురాగ్ యూనివర్శిటీ తన సామాజిక బాధ్యత విభాగమైన సహాయ ద్వారా అవసరంలో ఉన్నవారికి నిరంతరం సహాయం అందిస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. స్థిరమైన జీవనోపాధి సాధించేందుకు సహాయంగా షీలా కొమరుమల్లుకు ల్యాప్టాప్‌ను అందజేసినట్లు కళాశాల డీన్ జి. విష్ణుమూర్తి తెలిపారు. సహాయ సమన్వయ కర్యకర్తలైన నాగరాజు, అమితా మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లి తై బజార్ వేలం రూ.4.40వేలు

**దక్కించుకున్న పెరుమాండ్ల జంగయ్య**

**తలకొండవల్లి ,ఏప్రిల్ 7 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి గ్రామపంచాయతీలో మంగళవారంనాడు నిర్వహించిన తైబజార్ వేలంపాటలో 4,40,500 రూపాయలు పలికి అదే గ్రామానికి చెందిన పెర్మాండ్ల జంగయ్య అనే వ్యక్తి వేలంపాటల దక్కించుకున్నాడు. 2026-27 ఆర్థిక సంవత్సరానికిగాను మంగళవారంనాడు గ్రామపంచాయతీలో వేసిన వేలంపాటలో ఐదుమంది పాల్గొన్నారు. చివరకు 4,40,500 రూపాయలతో పెరుమాల జంగయ్య టై బజార్ను దక్కించుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలో జంగయ్యను గ్రామపంచాయతీ సర్పంచ్ శేఖర్ యాదవ్ ఉపసర్పంచ్ కోటీశ్వర్ గ్రామ కార్యదర్శి సత్యం ఆధ్వర్యంలో జంగయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ తైబజార్ వేలం ధర వచ్చిన నిధులతో గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు చేస్తామని, ప్రజలకు అవసరం మోలిక వసతుల కోసం ఖర్చు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇంట సంక్షేమ నిధుల జల్లు!

**-దౌల్తాబాద్‌లో ఘనంగా చెక్కుల పంపిణీ**



**దౌల్తాబాద్,ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి అన్నారు.మంగళవారంరోజు మండల కేంద్రంలోని స్థానిక చెన్నకేశవ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని,మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ది దారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ..ఆడబిడ్డల పెళ్లిళ్లకు తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణ లక్ష్మి,షాదిముబారక్ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.అలాగే అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి(సిఎంఆర్ఎఫ్) ఒక వరమని అన్నారు.82 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి,షాదీముబారక్ చెక్కులను,61 మంది బాధితులకు సీఎం సహాయ నిధి(సిఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు.ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమం క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని ఆయన ఈ సంధర్భంగా హామీ ఇచ్చారు.చెక్కులు అందుకున్న లబ్దిదారులు తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కూడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి,తహసీల్దార్ గాయత్రి,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్‌రావు,బోడి వెంకట్‌రెడ్డి,జంగం వీరన్న,సత్యపాల్,ప్రమోద్‌రావు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్,వివిధ గ్రామాల సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,పార్టీ కార్యకర్తలు,లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరెలతో మహిళలకు గౌరవం

**కొత్తూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**

కొత్తూరు మున్సిపల్ పరిధిలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని మహిళలకు శరీరం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల ఆత్మగౌరవాన్ని మరింత బలపరచాలనే లక్ష ్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందన పొందుతోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక స్థితిని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలంగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.చీరలు అందుకున్న మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, వైస్ చైర్మన్ డోలి రవి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జె సుదర్శన్ గౌడ్, కౌన్సిలర్లు హేమా దేవేందర్ ముదిరాజ్, కోస్గి శ్రీనివాస్, సోమ్లా నాయక్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, కే సురేందర్, జై జగన్, చిల్కమారి నరసింహ, ఇందూరి శ్రీనివాస్, ఆంజనేయులు గౌడ్, జనార్ధన్ చారి, నరసింహ గౌడ్, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఇన్స్పెక్టర్ నర్సయ్య, మరియు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

